క్లుప్తంగా

ఇంటి పన్నుల వసూళ్ల పరిశీలన



రశీదు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

చెన్నూర్: మున్సిపాలిటీలో ఇంటి పన్నుల వసూళ్లను మున్సిపల్ కమిషనర్ గంగాధర్ పరిశీలించారు. లైన్‌గడ్డలో ఇంటి పన్నులు చెల్లించిన ఇంటి యాజమానికి రశీదు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఇంటి పన్నుల వసూళ్ల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జాయింట్ సెక్రెటరీగా రమేశ్



దండేపల్లి: హైదరాబాద్ నాంపల్లి మెట్రోపాలిటన్ కోర్టు బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మామిడాల రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పోచమ్మకు భక్తుల మొక్కులు



డప్పుచప్పుళ్లతో గుడికి వస్తున్న భక్తులు

బెల్లంపల్లి: స్థానిక పోచమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బస్తీల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు డప్పు చప్పుళ్లతో గ్రామదేవత గుడి చుట్టూరా ప్రదక్షిణలు చేసి గుడిలో పూజలు చేశారు. కోళ్లు, మేకలను బలిచ్చి సల్లంగా చూడాలని వేడుకున్నారు. భక్తుల తాకిడితో పోచమ్మ దేవాలయ ప్రాంగణం సందడిగా మారింది. భక్తులు అనేక మంది గుడి పక్కన బోనాలు చేసుకుని పోచమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు.

'నవోదయ'కు ఎంపికైన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

చెన్నూర్: పట్టణంలోని శర్వాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థి గౌరబత్తుని దిలీప్ నవోదయ, గుర్రం ఆకాశ్ భారత సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్షలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నవోదయ, సైనిక్ పాఠశాలలో ప్రవేశ పరీక్షలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి అభినందించారు.


సెల్‌ఫోన్ అప్పగింత



శ్రీనివాస్‌కు ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

భీమారం: మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన వేల్పుల శ్రీనివాస్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ని స్వాధీన పర్చుకొని ఆదివారం శ్రీనివాస్‌కి అప్పగించినట్లు ఎస్సై రాములు తెలిపారు. 11నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడని తెలిపారు. ఈ మేరకు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నస్పూర్: పట్టణ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. పట్టణ పరిధిలోని 20వ వార్డులో చేపట్టిన బస్తీ దవాఖానా, సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులను ఆదివారం ఆయన పరిశీలించి, పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో కూరగాయల సాగు

- తక్కువ రోజుల్లోనే పంట చేతికి
- పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ

చెన్నూర్‌రూరల్: రబీ సీజన్‌లో రైతులు కూరగాయల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. తక్కువ రోజుల్లోనే పంట చేతికి రావడమే కాకుండా పెట్టుబడి తక్కువ లాభాలు ఎక్కువగా ఉండడంతో కూరగాయలు సాగు చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాల్లో రైతులు వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. చెన్నూర్ మండలంలోని కత్తెరసాల, సుద్దాల, శివలింగాపూర్, సుబ్బరాంపల్లి, కిష్టంపేట, సుద్దాల, అంగ్రాజ్‌పల్లి, దుగ్నెపల్లి, చింతలపల్లి, అక్కెపల్లి, ఆస్నాద, తదితర గ్రామాల్లో ఒక్కో రైతు పది గుంటల నుంచి ఎకరా విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. అల్చింత, బెండ, వంకాయ, మిరప, టమాట, గోబీ వంటి కూరగాయలతో పాటు తోటకూర, కొత్తిమీర, పాలకూర, పూదీన, చుక్కకూరలాంటి ఆకుకూరలు సైతం సాగు చేస్తున్నారు. మొక్కలకు ప్రతీరోజు ఉదయం బోరుబావుల నుంచి నీటిని అందిస్తున్నారు. పంటలు వేసినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. విత్తనాలు విత్తిన రెండు నెలలకే మొక్కలు పెరిగి కాపుకు వస్తున్నాయి. వాటికి ఎలాంటి పురుగు ఆశించకుండా మందులు పిచికారీ చేస్తున్నారు. రెండు రోజులకోసారి తోటకూర, బెండ, మిరప, టమాట, వంకాయలు 20 కిలోల నుంచి 30 కిలోల వరకు దిగుబడి వస్తుందని, వాటిని చెన్నూర్, మంచిర్యాల, గోదావరిఖని మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.



అంగ్రాజ్‌పల్లిలో సాగుచేసిన వంకాయ తోట

ఏటా సాగు చేస్తున్న



మా గ్రామంలోని రైతులందరం ఎక్కువగా కూరగాయలు సాగు చేస్తాం. తక్కువ పెట్టుబడి మాత్రమే కాకుండా తక్కువ సమయంలో కూరగాయలు చేతికి వస్తాయి. అంతగా కష్టపడాల్సిన అవసరం కూడా లేదు. చెన్నూర్, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముతా.

\- సతీశ్, రైతు, శివలింగాపూర్

కూరగాయలు మేలు



రబీలో కూరగాయల సాగు ఎంతో మేలు. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో, తక్కువ రోజుల్లో కూరగాయలు చేతికి వస్తాయి. వేసవి కాలంలో ధరలు ఎక్కువగా ఉంటాయి. మంచి లాభాలు ఆర్జించవచ్చు. చీడపీడలు సోకితే హార్టికల్చర్ అధికారులను సంప్రదించాలి.

\- తిరుపతి, హార్టికల్చర్ అధికారి

బాబోయ్ కుక్కలు..!

- 20రోజుల్లో 30మందిపై దాడి
- పట్టించుకోని అధికారులు



నెన్నెల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని వీధుల్లో కుక్కల బెడద అధికమైంది. రోడ్డుపై వెళ్లే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. మహిళలు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు పాట్లు తప్పడం లేదు. జనం బయటకు రావడానికి జంకుతున్నారు. వృద్ధులు చేతి కర్ర లేనిదే బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో ప్రధాన రహదారుల్లో తిష్ట వేసి అటుగా వెళ్తున్న వారికి చుక్కలు చూపిస్తున్నాయి. ఎక్కడ చూసినా వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ అందరినీ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రధాన రహదారులపై చేరి నానా హంగామా చేస్తున్నాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను సమీప ప్రాంతంలోనే పడేయడంతో కుక్కలు గుంపులు గుంపులుగా అక్కడికి చేరుతున్నాయి. పాఠశాలల్లో మిగిలిన మధ్యాహ్న భోజనాన్ని ఓ పక్కన వేయడంతో కుక్కలు పాఠశాలల్లోకి ప్రవేశిస్తున్నాయి. పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తూ మనుషులను వెంటబడి తరుముతున్నాయి. ప్రధాన కూడళ్లలో తిష్ట వేసి ఉండటంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. పలు మార్లు పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

20 రోజుల వ్యవధిలో జరిగిన సంఘటనలు

మార్చి 10 నుంచి 20రోజుల వ్యవధిలో మండలంలో 30మందిపై పిచ్చికుక్కలు దాడి చేసి గాయపర్చాయంటే పిచ్చికుక్కల బెడద ఏ మేరకు ఉందో ఇట్టే అర్థమవుతోంది. మూడు, నాలుగు రోజుల క్రితం నెన్నెలలో జంగిలి కైలాస్ అనే హమాలీ, దురిశెట్టి మంజుల, కొమ్మెరి మదునక్క, పుట్ట రామయ్యలపై పిచ్చికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వారం రోజుల క్రితం గొల్లపల్లికి చెందిన పి.స్నేహ అనే యువతి, గన్‌పూర్‌కు చెందిన లింగంపల్లి రమేష్, చిత్తాపూర్‌కు చెందిన పాలవేణి సాయితేజ, ఆవుడం గ్రామానికి చెందిన తోకల పద్మ, మైలారంకు చెందిన చిన్నారి సంద్ర నక్షత్రలపై దాడి చేసి గాయపర్చాయి. నెన్నెలలో తోట శ్రీనుకు చెందిన లేగదూడ, పుట్ట లస్మయ్యకు చెందిన దుడ్డెపై పిచ్చికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. మండలంలో ఇలాంటి సంఘటనలు మరెన్నో ఉన్నాయి. కుక్కల గుంపు కనిపిస్తే అక్కడి నుంచి ప్రజలు జంప్ అవుతున్నారు. నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ వెంట పడుతాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చికుక్కల బెడదను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సీఐ మోహన్

భీమారం: రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగేందుకు ప్రజలు సహకరించాలని శ్రీరాంపూర్ సీఐ మోహన్ పేర్కొన్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో ఆదివారం పోలీసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుని ప్రతి పౌరుడు నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ముఖ్యంగా ప్రజలు సహకరిస్తేనే ఎన్నికలు సజావుగా సాగుతాయన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల్లో ఓట్లు వేయాలని కోరారు. గ్రామాల్లోకి అనుమానాస్పద వ్యక్తులు వస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కి సమాచారం అందించాలని కోరారు. గతంలో మావోయిస్టులకు స్థావరంగా ఉన్న గ్రామాలను గుర్తించి ఇప్పుడు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఆయన ప్రకటించారు. ఎస్సై రాములు మాట్లాడుతూ.. 18సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందులో హెడ్ కానిస్టేబుల్ మాచర్ల, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు సంస్కారం నేర్పాలి



తల్లులను అభినందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

జన్నారం: చిన్నారులకు చదువుతోపాటు సంస్కారం నేర్పాలని ప్రముఖ మోటివేటర్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు సంస్కారం కార్యక్రమం పేరుతో మోటివేషన్ తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తలిదండ్రులకు వారి పిల్లల్లో నేర్పాల్సిన దయాగుణం, మంచి అలవాట్లు, సేవా గుణం, వారి గోల్ గురించి ఎలా చెప్పాలో తరగతుల ద్వారా నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోవిడ్ అనంతరం చిన్నారుల్లో చాలా పెనుమార్పులు వచ్చాయని, పనిచేసే తత్వం మరిచారని, వారికి అవన్నీ తెలియజేయాల్సిన పరిస్థితి మనపై ఉందని పేర్కొన్నారు. అందుకే విద్యార్థుల తల్లిదండ్రులకు సంస్కారం పేరుతో మోటివేషన్ తరగతులను నిర్వహించి, మనదేశం గర్వించేలా విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ రోజు వరకు 1200మంది విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మోటివేషన్ తరగతులను నిర్వహించి కొంతైనా మార్పు తీసుకురావాలనేది తన తపన అని అన్నారు. పది మంది ద్వారా వంద మంది తయారవుతారనే నమ్మకంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ప్రాజెక్ట్ ముంపుతో తీవ్రంగా నష్టపోతున్నాం'



మాట్లాడుతున్న ఆర్గనైజర్ రాములు

లక్సెట్టిపేట: జాతీయ రహదారి 63 నిర్మాణంతో గోదావరి నది తీరాన పంట పొలాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీకేఎస్ రాష్ట్ర ఆర్గనైజర్ దొనూరు రాములు అన్నారు. సూరారంలో ఆదివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణంతో చాలా మంది రైతులు వారి జీవనోపాధిని కోల్పోతున్నారని ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపుతో తీవ్రంగా నష్టపోయారని, అధికారులు ప్రభుత్వం ఆలోచించి విస్తరణ పనులను ఇతర ప్రదేశాల నుంచి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం రైతులు చర్చించారు. కార్యక్రమంలో జాతీయ సభ్యులు శ్రీధర్ రెడ్డి, గుంటక సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



భీమారం: వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నూర్: పట్టణంలో 63వ జాతీయ రహదారిపై సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

భీమారం: మంచిర్యాల-చెన్నూర్ జాతీయరహదారిపై భీమారం మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున ఎస్సై రాములు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణని కలిపే ఈ రహదారిపై వచ్చే వాహనాల రాకపోకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఆయా క్రైస్తవ సంఘాల్లో ఆదివారం ఈస్టర్ పండగను ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో ఉదయం 5గంటలకే ప్రత్యేక ఆరాధనను ప్రారంభించారు. చర్చి పాస్టర్ జాషువా ఈస్టర్ దైవసందేశాన్ని అందించారు. పాపుల పరిహారార్థమే ఏసుక్రీస్తు సిలువ మరణం పొంది మృత్యుంజయుడిగా తిరిగి లేచాడని అన్నారు. పునరుత్థాన విశ్వాసాన్ని ప్రతీ వ్యక్తి కలిగియుండాలన్నారు. స్త్రీలమైత్రి ఆధ్వర్యంలో చర్చి ఆవరణలో గల సిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగించి దీపారాధన చేశారు. కార్యక్రమంలో చర్చి సెక్రెటరీ డొక్కల డేవిడ్, స్త్రీల ప్రెసిడెంట్ కళావతి, కార్యదర్శి ప్రేమలత పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: ఈస్టర్‌ను పురస్కరించుకుని మండలంలోని క్రైస్తవులు ఆదివారం వేడుకలు జరుపుకున్నారు. ఉదయం నుంచి సమీప చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక సీఎస్ఐ చర్చి శిల్వ గుట్టపై క్రైస్తవులు పెద్ద మొత్తంగా హాజరై కీర్తనలు పాడుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్ డెవిడ్‌పాల్ హాజరై క్రైస్తవులకు సందేశాన్ని అందించారు. ఏసుక్రీస్తు మరణించి తిరిగి లేచిన రోజు గురించి వివరించారు. క్రైస్తవులు పాడిన కీర్తనలతో చర్చి ప్రదేశంలో మారుమోగాయి. కార్యక్రమంలో సీఎస్ఐ ప్రెస్ బీటర్ ఇన్‌చార్జి ఆసాది సాల్మన్, కమిటీ సభ్యులు మామిడి ప్రసాద్, నక్క జాకబ్, పవన్, జైవీర్ సంఘు సభ్యులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంతో పాటు, మండలంలోని అన్ని గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను క్రైస్తవ భక్తులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిల వద్ద శిలువ వెలిగింపు, ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. క్రైస్తవ సంఘు పెద్దలు, చర్చిపాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: సీఎస్ఐ చర్చి గుట్టపై ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ఈస్టర్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే క్రీస్తు విశ్వాసులు చర్చిల్లోకి వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాత బస్టాండ్ సమీపంలోని బేతెస్థ చర్చిలో పాస్టర్ జైపాల్‌రెడ్డి క్రీస్తు వ్యాక్యాన్ని బోధించారు.

చెన్నూర్: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఫాస్టర్ యేసుదాస్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సువర్ట్ దేవదాస్, శంకర్ సంమసన్ పాల్గొన్నారు.

నస్పూర్: ఈస్టర్ వేడుకలను క్రైస్తవు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఏసుక్రీస్తు పునరుద్ధాన దినోత్సవం సందర్భంగా క్రైస్తవులు కృష్ణాకాలనీలోని సీఎస్ఐ వెస్లే చర్చిలో కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ రేవా కే.సురేష్, పెద్దలు కే.వినయ్, ప్రశాంత్, రాజు, బోయరాజు, తదితరులు పాల్గొన్నారు.



నస్పూర్: కృష్ణాకాలనీ సీఎస్ఐ చర్చి వద్ద...



రామకృష్ణాపూర్: సీఎస్ఐ చర్చిలో...



చెన్నూర్ సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ వేడుకలు



మందమర్రిరూరల్: సందేశమిస్తున్న పాస్టర్



మేదరిపేటలో శిలువ వెలిగింపులో క్రైస్తవులు

బీజేపీ కమిటీ ఎన్నిక

మందమర్రిరూరల్: మందమర్రి బీజేపీ కమిటీని ఆదివారం మంచిర్యాలలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, చెన్నూర్ నియోజకవర్గ కన్వీనర్ అక్కల రమేశ్ ప్రకటించారు. మందమర్రి పట్టణ ఉపాధ్యక్షులుగా తుపాకుల శ్రీనివాస్, దాసరి నర్సింగ్, కార్యదర్శులుగా పిట్ట రాజమౌళి, రామ్ కిష్టయ్య, ములుమూరి రమేశ్, బైరి శ్రీనివాస్, ఎర్రోజుల శ్రీనివాస్, ఎస్సీమోర్చ ఉపాధ్యక్షుడిగా మేరుగు తిరుపతి, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా అట్టెం భీమ్, వాణిజ్య సెల్ విభాగం మండల అధ్యక్షుడిగా బొడ్ల భూపతిని నియమిస్తూ నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మందమర్రి పట్టణ అధ్యక్షుడు మార్త కుమారస్వామి, సీనియర్ నాయకులు డీవీ దీక్షితులు, దుర్గరాజ్ తదితరులు ఉన్నారు.

'బార్ అసోసియేషన్ అధ్యక్షుడిపై విమర్శలు అర్థరహితం'



మాట్లాడుతున్న రాజేశ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్‌పై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేశ్ అన్నారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మత్తమారి సూరిబాబు, జయరాం యాదవ్ అనవసరంగా బార్ అసోషియేషన్ ఎన్నికల్లో తలదూర్చి విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఈ తీరు ఏమాత్రం మంచిది కాదన్నారు. న్యాయవాదుల ఎన్నికలను ఆసరా చేసుకుని విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇకనైనా నిరాధారమైన విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో తెలంగాణ మాల మహానాడు జిల్లా మాజీ వైస్ ప్రెసిడెంట్ మద్దెల గోపి, పట్టణ గౌరవ అధ్యక్షుడు సుకాసి కృష్ణమూర్తి, నాయకులు నంది కొమురయ్య, సోగాల రవికుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కరపత్రాల విడుదల

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలను జై భీమ్ సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆసాది పురుషోత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి సొల్లు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి పత్తి రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగుల దుర్గయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి భాస్కర్, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి, శీలం వెంకటేశ్, కర్ర శ్రీనివాస్, సురిమిల్ల రంజిత్ పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీలో చోటు

జన్నారం: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కార్యవర్గంలో జన్నారం మండలానికి చెందిన ఇద్దరికి చోటు లభించింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా జన్నారంకు చెందిన చిలువేరి నర్సయ్య, కార్యవర్గ సభ్యుడిగా గాజుల లింగన్నగౌడ్‌లకు చోటు లభించింది. జిల్లా అధ్యక్షుడు సత్యం వారి పేర్లను ప్రకటించారు.

చిన్నారులకు ఆర్థిక సాయం

మందమర్రిరూరల్: తలిదండ్రులను కోల్పోయి అనాథలైన ఆర్తీక్, కార్తీక్ అనే చిన్నారులకు ఆత్మీయ చారిట్రబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.20వేల చెక్కును అందిచారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉందని, ఈ సమయంలో వారికి అండగా నిలిచి సహాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ట్రస్ట్ ట్రెజరరీ సురేష్, ప్రచార కార్యదర్శి శరత్ బాబు, సభ్యులు మహేందర్, సంపత్, వెంకటేశ్, అశోక్, జనార్దన్ ఉన్నారు.

బియ్యం అందజేత

భీమారం: మండలంలోని కాజిపల్లికి చెందిన దుర్గం దుర్గ కూతురు వివాహా నికి ఆదివారం ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ బుక్యా రాజ్‌కుమార్ క్వింటాల్ బియ్యం అందజేశారు. ఉపసర్పంచ్ డొంగరి రాజలింగు, కొమ్ము అశోక్ యాదవ్, మాజీ సర్పంచ్ కొండ చంద్రశేఖర్, బీరేష్ పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో తాగునీరు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై వాకర్స్ కోసం ఆదివారం ఉచితంగా తాగునీటి పంపిణీని వాకర్ అసోసియేషన్ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులు భాస్కర్‌రావు, రాజేందర్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ గురువయ్య, డాక్టర్ త్రినాథరావు, లక్ష్మణ్, సందీప్‌రావు, ప్రతాప్‌రెడ్డి, జూపాక సుధీర్, లక్ష్మి నారాయణ గౌడ్, రమణ, కార్యవర్గ సభ్యులు కిరణ్, శంకర్, కళ్యాణి, తిరుపతి, గుండ శ్రీధర్, గోపి పాల్గొన్నారు.